క్లుప్తంగా

విద్యార్థులు పట్టుదలతో చదవాలి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: విద్యార్థులు పట్టుదలతో చదవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతు శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ మహమ్మద్‌గౌస్ అన్నారు. శుక్రవారం స్థానిక కళాశాలలో బీజెడ్‌సీ గ్రూపు విద్యార్థులకు సెమిస్టర్, పీజీ పరీక్షలకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను ఆయన ఉచితంగా పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ స్వర్ణలత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించాలనే ఉద్దేశంతో స్టడీమెటీరియల్ అందజేశామని చెప్పారు. అధ్యాపకులు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ కోటేశ్వరరావు, కౌసల్యదేవి, వరలక్ష్మి, వహీదా, నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

బేతంచెర్ల: పట్టణంలో వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలో ఆలయ 9వ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప సేవా సమితి సభ్యులు మల్లు హుసేన్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, చిన్నికృష్ణ, నాగేశ్వర్‌రెడ్డి,రాంబాబు ఆధ్వర్యంలో అర్చకులు ఉదయం స్వామి వారికి పంచామృత అభిషేకం, మహా మంగళహారతి చేపట్టారు. అలాగే ఆలయంలో వినాయక, సుబ్రహ్మణ్యేశ్వర, మాలిక పురోత్తమ్మ విగ్రహాలకు శాస్త్రోకంగా పూజలు జరిపించారు. భక్తులు తరలివచ్చి అయ్యప్పస్వామికి పూజలు చేశారు. సాయంత్రం గ్రామోత్సవం చేశారు.

కోవెలకుంట్ల ఏపీఎంకు అదనపు బాధ్యతలు

కోవెలకుంట్ల: వైఎస్సార్ క్రాంతిపథం కోవెలకుంట్ల ఏపీఎంకు ఉయ్యాలవాడ మండల ఏపీఎంగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అక్కడ పనిచేస్తున్న ఏపీఎం శేఖర్‌ను సంజామల మండలానికి డిప్యుటేషన్‌పై బదిలీ చేశారు. ఆ స్థానంలో కోవెలకుంట్ల ఏపీఎం గురుస్వామికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆ పథక జిల్లా ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

11న ప్రవేశ పరీక్ష

అవుకు: ఆదర్శ పాఠశాలలో 2023–2024 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో చేరడానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 11వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుబ్బరాయుడు శుక్రవారం తెలిపారు. పట్టణ సమీపంలో మెట్టుపల్లె రహదారిలోనున్న ఆదర్శ పాఠశాలలో ఉదయం 10 నుంచి 12గంటల వరకు పరీక్ష ఉంటుందని చెప్పారు. విద్యార్థులు 9గంటల లోపు పాఠశాలకు చేరుకోవాలని, విద్యార్థులు హాల్‌టికెట్ తెచ్చుకోవాలని, బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామని, ఉదయం 8.30గంటలకు అవుకు బస్టాండ్‌లో పాఠశాలకు చేరుకోవటానికి బస్సు ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గురుకుల ప్రవేశ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

బేతంచెర్ల: గత నెల 20న జరిగిన 5వ తరగతి ఏపీ గురుకుల ప్రవేశ పరీక్షలో మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలోని ప్రకృతి విద్యా నికేతన్ విద్యార్థి మహీధర్ నాయుడు 95 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 24వ ర్యాంక్ సాధించాడు. అలాగే అదే పాఠశాలకు చెందిన రేవతి 93 మార్కులు, అర్చన, రోహిత్ చౌదరి 91, త్రివిక్రమ్‌రెడ్డి 90, వెస్లీ 89, నవ్య దర్శిని 87, శశాంక్ 85, శ్రీ లత 84 మార్కులు సాధించారు. బాలురు కాల్వ బుగ్గకు, అమ్మాయిలు బనవాసి పాఠశాలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ నర్ల రవికుమార్ రెడ్డి శుక్రవారం తెలిపారు.

గాయపడిన జింకకు చికిత్స



గాయపడిన జింక

డోన్: మండలంలోని ఉడుములపాడు గ్రామ సమీపంలోనున్న దత్తాత్రేయ స్వామి గుడి సమీపంలో గాయపడిన జింకను స్థానికులు గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో ఆ శాఖ సిబ్బంది జింకను స్వాధీనం చేసుకొని చికిత్స నిమిత్తం పశువైద్యశాలకు తరలించారు. సమీపంలో 44వ జాతీయ రహదారి దాటే క్రమంలో ఏదైనా వాహనం ఢీకొని జింక కాళ్లకు గాయాలై నడవలేని స్థితిలో పడిపోయిందని స్థానికులు తెలిపారు.

ఆర్థిక సాయం

డోన్ టౌన్: పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన అంజలి అనే యువతి చాలా కాలంగా లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతోందని తెలుసుకున్న చేయూత స్వచ్ఛంద సంస్థ సభ్యులు దాతల ద్వారా సేకరించిన రూ.50వేల నగదును వైద్య ఖర్చుల నిమిత్తం శుక్రవారం అందజేశారు. బాధితురాలి గురించి సోషల్ మీడియా ద్వారా సమాచారం తెలుసుకొని దాతలను సంప్రదించి పోగు చేసిన సొమ్మును బాధితురాలి తల్లి రాధమ్మకు అందజేశారు. సంస్థ వ్యవస్థాపకుడు రామనాయుడు,కోశాధికారి శ్రీను, సభ్యులు ఉన్నారు.

సూక్ష్మ సేద్యానికి ఊతం

- రాయితీపై డ్రిప్ పరికరాలు
- తక్కువ నీటితో అధిక దిగుబడి
- 2023-24లో 5వేల హెక్టార్ల లక్ష్యం
- జిల్లాకు రూ.20 కోట్ల రాయితీ కేటాయింపు

బీడు, మెట్ట భూముల్లోనూ మెరుగైన దిగుబడులు సాధించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించేలా సూక్ష్మ సేద్య పరికరాలను రాయితీపై అందజేస్తుంది. గతేడాది 4,500 హెక్టార్లకు పరికరాలు అందజేయగా 4,125 మంది రైతులు లబ్ధిపొందారు. రాయితీ రూపంలో ప్రభుత్వం రూ.17 కోట్లు అందజేసింది. ఈ ఏడాది 5వేల హెక్టార్లలో సుమారు 4వేల మంది రైతులకు పరికరాలు పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్దేశించింది. ఇందుకు రాయితీ రూపంలో రూ.20కోట్లు కేటాయించనుంది.



వ్యవసాయ పొలంలో డ్రిప్ ఏర్పాటు చేసిన దృశ్యం



డ్రిప్ ద్వారా పంటలకు సాగునీరు

బనగానపల్లె: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోంది. సేద్యంలో అధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకొని రైతులు సులువుగా పంటలు సాగు చేసే దిశగా ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా బిందు సేద్యం పరికరాలను రాయితీపై పంపిణీ చేస్తుంది. తక్కువ నీటితో అధిక దిగుబడి సాధించేలా ప్రోత్సహిస్తోంది. ముఖ్యంగా మెట్ట ప్రాంత రైతాంగానికి మరింత ఎక్కువ సబ్సిడీపై డ్రిప్ సామగ్రిని అందిస్తోంది. అన్నదాతల అవసరాలకు అనుగుణంగా 5 వేల నుంచి 10వేల ఎకరాలకు బిందు సేద్యం పరికరాలను అందజేయాలని లక్ష్యంగా నిర్దేశించింది.

రూ.20 కోట్ల రాయితీ కేటాయింపు.. జిల్లాలో 2022-23లో 4వేల హెక్టార్లకు డ్రిప్ పరికరాలు అందించాలనే లక్ష్యం పెట్టుకోగా 4,500 హెక్టార్లకు అందజేశారు. దీంతో 4,125 మంది రైతులు లబ్ధిపొందారు. రాయితీ రూపంలో ప్రభుత్వం రూ.17 కోట్లు వెచ్చించింది. 2023-24కు సంబంధించి 5వేల హెక్టార్లలో సుమారు 4వేల మంది రైతులకు డ్రిప్ పరికరాలు పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. ఇందు కోసం రాయితీ రూపంలో ప్రభుత్వం రూ.20కోట్లు కేటాయించనుంది. బిందు పరికరాల కోసం అర్హులైన అవసరం ఉన్న రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవడం ప్రారంభించారు.

ప్రయోజనాలు..

- తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటసాగు చేయడానికి బిందు సేద్యం దోహదపడుతుంది.
- బిందువుల రూపంలో నీటిని అందించడంతో కలుపు సమస్య ఉండదు.
- వ్యవసాయ కూలీల ఖర్చు తగ్గుతుంది.
- నీరు గాలి పోషకాలు ఎల్లప్పుడు సమపాళ్లలో అందడం వల్ల మొక్క ఆరోగ్యంగా పెరిగి అదిక దిగుబడి లభించేందుకు ఉపయోకరంగా ఉంటుంది.
- విద్యుత్, నీరు, ఎరువులు అదా అవుతాయి.
- పంట దిగుబడి పెరుగుతుంది. పురుగులు తెగుళ్ల ఉధృతి తగ్గుతుంది.
- అంతరపంట సేద్యం పెద్దగా ఉండదు.
- బత్తాయి,మామిడి, నిమ్మ, సపోట, అరటి, మిరప, అయిల్‌ఫాం, చెరకు, ఉల్లి, మల్బరీ తదితర పంటలకు డ్రిప్ ఇరిగేషన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

రాయితీ ఇలా..

- ఐదు ఎకరాల్లోపు సన్నచిన్నకారు రైతులకు డ్రిప్ పరికరాలకు 90శాతం రాయితీ లభిస్తుంది.
- 8 ఎకరాల పైన 10 ఎకరాల్లోపు ఉన్న వారికి 70 శాతం రాయితీ ఉంటుంది.
- ఐదు ఎకరాల్లో సన్నచిన్న కారు రైతులకు స్ప్రింక్లర్లు 50 శాతం రాయితీ, 5–10 ఎకరాల్లోపు వారికి 45 శాతం రాయితీపై అందిస్తారు.
- పరికరాలపై రాయితీ పొందడానికి రైతులు 1బీ రికార్డుతో రైతుభరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

ఎంతో ఉపయోగకరం



పది ఎకరాల్లో అరటి, మూడు ఎకరాల్లో దానిమ్మ పంట బిందు సేద్యం పద్ధతిలో సాగు చేస్తున్నా. డ్రిప్ పద్ధతిలో నీటి పొదుపు ఎక్కువగా ఉంటుంది. మొక్కకు ఎంత నీరు అవసరమో అంతే లభిస్తుంది. పంటలకు జీవామృతాన్ని ఈ విధానంలోనే అందిస్తున్నాం. కూలీల సమస్య ఉండదు. పెట్టుబడి తక్కువగా ఉంటుంది. – రామచంద్రారెడ్డి, రైతు, సుంకేసుల, అవుకు మండలం

నీటి సమస్య ఉండదు



బిందు సేద్యం ద్వారా పంటలకు నీరు తక్కువ ఉన్నపటికీ ఇబ్బంది ఉండదు. నాకున్న నాలుగున్నర ఎకరాల్లో డ్రిప్ పరికరాలు ఏర్పాటు చేసుకున్నా. మునగ, బెండ, పసుగ్రాసం, ఇతర పంటలను సాగు చేశాను.వీటికి ఎటువంటి సమస్యలేకుండా నీరు లభిస్తుంది. బిందు సేద్యం పట్ల ప్రతి రైతు ఉత్సాహం చూపాలి. – రామకృష్ణ, రైతు, రామకృష్ణాపురం, బనగానపల్లె మండలం

అన్నదాతకు అండగా ప్రభుత్వం



ప్రభుత్వం అన్నదాతకు అండగా నిలిచింది. ఈ సంవత్సరం జిల్లాలో 5వేల హెక్టార్లలో డ్రిప్ ఏర్పాటు చేయాలని లక్ష్యం నిర్దేశించారు. ఇందు కోసం రైతులకు రాయితీగా సుమారు రూ.20 కోట్ల వెచ్చిస్తున్నాం. ప్రధానంగా నీటి కొరతను అధిగమించేందుకు బిందు సేద్యాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. రాయితీపై రైతులకు డ్రిప్ పరకరాలను పంపిణీ చేసేందుకు కసరత్తు చేస్తున్నాం. – శివసత్యనారాయణ, జిల్లా మైక్రోఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్

గర్భిణులు వైద్యుల సూచనలు పాటించాలి



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

అవుకు: గర్భిణులు వైద్యుల సూచనలు పాటించాల ని అవుకు సీహెచ్‌సీ డాక్టర్లు రవి కుమార్, ప్రశాంతి ఉప్పలపాడు పీహెచ్‌సీ డాక్టర్ యమున సూచించా రు. శుక్రవారం స్థానిక సీహెచ్‌సీలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వఅభియాన్ కార్యక్రమంలో భాగం గామండల పరిధిలోని 68 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.వారిలో 31 మంది హైరిస్క్ లో ఉన్నట్లు గుర్తించి పలు సూచనలు చేశారు.

మంత్రి బుగ్గనకు సన్మానం



మంత్రి బుగ్గన, ఎమ్మెల్సీని సత్కరించిన దృశ్యం

డోన్: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డితో పాటు ఎమ్మెల్సీ ఏసురత్నం, పులివెందుల మునిసిపల్ చైర్మన్ వరప్రసాద్‌ను నియోజకవర్గంలోని వడ్డెరులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. స్థానిక మధు ఫంక్షన్ హాల్‌లో జరిగిన వడ్డెరుల ఆత్మీయ సమావేశంలో సంఘం అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో వారిని సత్కరించారు.

వేరుశనగ విత్తనాల పంపిణీ

డోన్: మండలంలోని యు.కొత్తపల్లె గ్రామ రైతు భరోసా కేంద్రంలో రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాలను సర్పంచ్ ఎర్రగుంట్ల విద్య శుక్రవారం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ, వేరుశనగ క్వింటా ధర రూ.9,800 ఉండగా, 40 శాతం సబ్సిడీతో ప్రభుత్వం రూ.5,580 ప్రకారం అందజేస్తోందన్నారు. ఎంపీఈఓ నరసింహులు, నాయకులు మిన్నెల్ల హుసేన్, మహేశ్వరరెడ్డి, నబిరసూల్, రామచంద్రుడు పాల్గొన్నారు.

అతిసారపై అప్రమత్తంగా ఉండండి

అవుకు: ఐదు సంవత్సరాల లోపు వయసున్న చిన్నారుల తల్లిదండ్రులు అతిసార వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని ఉప్పలపాడు పీహెచ్‌సీ డాక్టర్ యమున సూచించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చిన్నారుల తల్లులకు అతిసార వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె డాక్టర్ మాట్లాడుతూ చిన్నారులు అతిసార వ్యాధి భారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని, క్లోరినేషన్ చేసిన నీటినే తాగాలని, ఆరు నెలల వరకు తల్లిపాలనే తాపించాలని చెప్పారు. అలాగే వ్యాధి వచ్చిన పిల్లలకు ఓఆర్‌ఎస్ ద్రావణంతో పాటు 14 రోజులు జింక్ మాత్రలను వాడాలని తెలిపారు. పీహెచ్‌ఎన్ మల్లీశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్లు కమాల్ సాహెబ్, వేణుగోపాల రాజు పాల్గొన్నారు.

చిరు ధాన్యాల సాగును ప్రోత్సహించాలి

డోన్ టౌన్: రైతు భరోసా కేంద్రాల వ్యవసాయ సహాయకులు రైతులకు అందుబాటులో ఉంటూ చిరు ధాన్యాల సాగును ప్రోత్సహించాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చంద్రన్న, వ్యవసాయ అధికారి అబ్దుల్ షఫి సూచించారు. స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉన్న ఎరువులు,విత్తనాలు,మందులపై చర్చించారు. అర్హత ఉండి రైతు భరోసా నిధులు జమ కాని రైతుల వివరాలు సేకరించి వారికి నగదు జమ అయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

కోవెలకుంట్ల: నవరత్నాలు– పేదలందరికీ ఇళ్ల పథకం కింద పక్కాగృహాలు మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని తహసీల్దార్ పుష్పకుమారి, ఎంపీడీఓ రాధిక సూచించారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం హౌసింగ్ లబ్ధిదారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ పక్కా గృహానికి ప్రభుత్వం మూడు విడతల్లో రూ.1.80 లక్షలతో పాటు ఉచితంగా 20 టన్నుల ఇసుక, రాయితీపై సిమెంట్, కడ్డీలు, గృహ నిర్మాణ సామగ్రి అందజేస్తోందన్నారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి సొంతింటి కల నెరవేర్చుకోవాలని చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ సుదర్శన్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

రైతులు అధికారుల సలహాలు పాటించాలి

ప్యాపిలి: రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామి రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ భూసార పరీక్షల ఫలితాలను పరిగణలోకి తీసుకొని పంటలు సాగు చేయాలని సూచించారు. వ్యవసాయ అధికారి రాజేష్ , మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ చంద్ర శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: సబ్ స్టేషన్‌లో మరమ్మతులో భాగంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పట్టణ ఏఈ నాగేశ్వరరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని కొత్తబస్టాండ్ ఏరియా, మాదన్ననగర్, సుందర్‌సింగ్ కాలనీ, తారకరామనగర్, ఇందిరానగర్, పాతపేట, కొండపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ప్రజలు సహకరించాలని కోరారు.

బీమా నమోదులో బనగానపల్లెకు మొదటిస్థానం

బనగానపల్లెరూరల్: వైఎస్సార్ బీమా నమోదు కార్యక్రమంలో బనగానపల్లె మండలంలో నంద్యాల జిల్లాలో మొదటి స్థానంలో ఉందని ఎంపీడీఓ శివరామయ్య శుక్రవారం తెలిపారు. మండలంలో మొత్తం 30,547 కుటుంబాలు ఉండగా ఇప్పటి వరకు 28,300 మందిని వైఎస్సార్ బీమాలో నమోదు చేసి జిల్లాలోనే 78.64 శాతం సాధించి మొదటి స్థానంలో నిలిచిందని చెప్పారు. అలాగే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంజేఏవై, ఆయుస్మాన్ భారత్ హెల్త్‌కార్డు నమోదులో కూడా మొదటి స్థానంలో ఉన్నామని, ఇందులో 29,272 మందికి గాను 24,864 మందికి ఈకేవైసీ చేసి 85.05 శాతం నమోదు సాధించినట్లు వివరించారు.

శుభకార్యం

బేతంచెర్ల: పట్టణంలోని అమ్మవారిశాలలో గ్రూప్ దేవాలయాల చైర్మన్ గుండా జగన్ మోహన్‌రావు కుమారుడు అశ్వర్థనారాయణ, హిమబిందు వివాహం శుక్రవారం జరిగింది. వేడుకకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే హెచ్ కొట్టాల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వై.చిన్నమద్దయ్య కుమారుడు దివాకర్ వివాహానికి మంత్రి హాజరయ్యారు.

డోన్ టౌన్ : నూతన దంపతులు హైమావతి,శివకుమార్‌రెడ్డిలను రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆశ్వీరదించారు. కేడీసీసీ బ్యాంక్ డైరెక్టరు సీమ సుధాకర్‌రెడ్డి, ప్యాపిలి మండలం గార్లదిన్నె సర్పంచ్ సీమ మనోహరమ్మ దంపతుల కుమార్తె అయిన హైమావతికి ఇటీవల శివకుమార్‌రెడ్డితో పెళ్లి జరిగింది.

వైద్యసేవల్లో నిర్లక్ష్యాన్ని సహించం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల(రూరల్): వైద్య సేవల్లో నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అన్నారు. కానాల, పోలూరు గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌లను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రజలకు ఉచితంగా అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు మందులను కూడా అందజేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. హైరిస్కు గర్భిణులకు చేస్తున్న హిమోగ్లోబిన్ స్థాయి పరీక్షలు, వారికి పంపిణీ చేస్తున్న ఐరన్ ఫోలిక్ మాత్రల గురించి అడిగి తెలుసుకున్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో పలు రికార్డులు, రిజిస్టర్లు, యాప్‌లను కలెక్టర్ తనిఖీ చేశారు. మాతా శిశువు మరణాలు అరికట్టడానికి అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్యశాఖ కార్యకర్తలు సమన్వయంగా పనిచేయాలని ఆదేశించారు. చాపిరేవుల, గోస్పాడు పీహెచ్‌సీల వైద్యులు ఉదయసంధ్య, గోపాల్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ తనూజ పాల్గొన్నారు.

విద్యాకానుక కిట్ల పరిశీలన

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎస్పీజీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌లో జగనన్న విద్యాకానుక కిట్లను శుక్రవారం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పరిశీలించారు. బూట్లు, యూనిఫాం, పుస్తకాలను పరిశీలించారు. ఈనెల 12వ తేదీన పాఠశాలల పునః ప్రారంభం రోజున అన్ని పాఠశాలలో పంపిణీకి సిద్ధంగా ఉంచాలని జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. డీఈఓ అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల పనులు త్వరగా పూర్తి చేయాలి

నంద్యాలటౌన్: నంద్యాల మెడికల్ కళాశాలలో మిగిలిన నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి కళాశాల ప్రిన్సిపాల్‌కు అప్పగించాలని ఏపీఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ మురళీధర్ రెడ్డి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కళాశాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌తో కలిసి పరిశీలించారు. మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ పనులు చివరి దశకు వచ్చాయని, మెడికల్ విద్యార్థులకు అవసరమయ్యే సదుపాయాలను దగ్గరుండి ఏర్పాటు చేసుకోవాలని ప్రిన్సిపాల్ స్వర్ణలత, వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్ కుమార్‌కు సూచించారు. లెక్చరర్ హాల్, అనాటమీ, ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీ, హిస్టాజికల్ ల్యాబ్‌లను పరిశీలించి ఇంజినీర్లకు పలు సూచనలు చేశారు. జూలై 1వ తేదీ లోపు ప్రిన్సిపాల్ ఛాంబర్‌ను సిద్ధం చేసుకుని అక్కడే ఉండి పనులు పూర్తి చేయించాలని చెప్పారు. గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్లలో జూలై 30లోపు పనులు పూర్తిస్థాయిలో ముగించాలని ఎస్ఈటీ కృష్ణారెడ్డి, ఈఈ శ్రీనివాసులు రెడ్డిని ఆదేశించారు. సర్వజన వైద్యశాల పర్యవేక్షకులు ప్రసాదరావు ఉన్నారు.



పోలూరులో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలను పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

క్రైం కార్నర్


వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన బాలలక్ష్మిరెడ్డి

అవుకు(కొలిమిగుండ్ల): కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని అంకిరెడ్డిపల్లె గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. గ్రామానికి చెందిన అంకెపల్లి బాల లక్ష్మిరెడ్డి (39) గురువారం రాత్రి అయినా ఇంటికి రాలేదు. మరుసటి రోజు గ్రామ సమీపంలోని బావిబయట లక్ష్మిరెడ్డి చెప్పులను చూసి బావిలో చూడగా మృత దేహం కనిపించింది. లక్ష్మిరెడ్డి చిన్ననాటి నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతుండే వాడని, తరచూ ఫిట్స్ రావటం, పెళ్లి కాలేదనే దిగులుతో ఉండేవాడని, మానసిక పరిస్థితి సరిగాలేక గ్రామ సమీపంలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి తల్లి ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్ఐ రమేష్ రెడ్డి తెలిపారు.

కోలుకోలేక వ్యక్తి మృతి



రంగస్వామి (ఫైల్)

డోన్ టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి కర్నూలు వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక రంగస్వామి(26) శుక్రవారం మృతి చెందినట్లు పట్టణ పోలీసులు, బంధువులు తెలిపారు. కృష్ణగిరి మండలం బోయ బొంతిరాళ్ల గ్రామానికి చెందిన రంగస్వామి తన సమీప బంధువు తుగ్గలి మండలం మారెళ్ళ గ్రామానికి చెందిన శైలజ్‌కుమార్ అలియాస్ చింటూతో కలిసి బైకుపై ఈనెల 1న డోన్‌లో జరుగుతున్న బంధువుల పెళ్లికి వచ్చారు. పెళ్లి ఊరేగింపు అనంతరం తిరిగి గ్రామానికి బైకుపై వెళ్తుండగా కంబాలపాడు సర్కిల్‌లోని హైవే ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో స్పీడు బ్రేకర్ వద్ద బైకు అదుపు తప్పి కిందపడటంతో రంగస్వామి తీవ్రంగా గాయపడ్డాడు. చింటూకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను మెరుగైన వైద్య చికిత్స నిమ్మిత్తం కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రంగస్వామి కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య రాధమ్మ, కూతరు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని మహిళ బలవన్మరణం

బేతంచెర్ల: మండలంలోని కొమ్మూరి కొట్టాల గ్రామ సమీపంలో రహదారి పక్కనున్న చెట్టుకు ఉరేసుకొని ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ శివశంకర్ నాయక్ వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా, మార్కాపురం, మండలం రాయవరం చల్లా శ్రీను భార్య గురవమ్మ (48) కుటుంబ సభ్యులతో ఉపాధి నిమిత్తం బేతంచెర్లకు వచ్చి వాటర్ గ్రిడ్ పనులు చేస్తున్నారు. అయితే గురవమ్మ ఐదేళ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతుంది. పలుచోట్ల వైద్యం చేయించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది గురువారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి కనుమకింది కొట్టాల గ్రామ సమీపంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. శుక్రవారం ఉదయం గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి పరిశీలించారు. మృతురాలి కుమారుడు వెంకటసాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని బనగానపల్లెకు తరలించారు.

దుకాణాల్లో చోరీ

ప్యాపిలి: పట్టణంలో శుక్రవారం తెల్లవారుజామున ఆరు దుకాణాల్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. కలచట్ల రోడ్డులోని జనరిక్ మందుల షాపు తాళాలు పగులగొట్టి రూ.23వేలు నగదు అపహరించారు. అలాగే మెయిన్ బజార్‌లోని ఫర్టిలైజర్ షాపు, మెడికల్ షాపు, ఎలక్ట్రికల్ షాపు మరో రెండు కిరాణా షాపుల తాళాలను ధ్వంసం చేశారు. అయితే ఆయా దుకాణాల్లో నగదు లభించక పోవడంతో వెళ్లి పోయారు. బాధిత దుకాణదారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రిటైర్డు టీచర్ మృతి



మౌలాలి (ఫైల్)

డోన్ టౌన్: ఎస్కేపీ హైస్కూల్ రిటైర్డు టీచర్ మౌలాలీ (72)శుక్రవారం పట్టణంలోని ఆయన స్వ గృహంలో మృతి చెందారు. క్రాఫ్ట్ టీచర్‌గా, ఆర్టిస్టుగా, బండలపై పేర్లు చెక్కే కళాకారుడిగా పట్టణ ప్రజలతో పాటు వివిధ గ్రామాల ప్రజలకు సుపరిచితుడిగా పేరుగాంచారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

ఆటో బోల్తా.. నలుగురికి గాయాలు



ప్రమాదానికి గురైన ఆటో

డోన్ టౌన్: మండలంలోని ఉంగరాని గుండ్ల గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఆటో బోల్తా పడి.అందులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి. పట్టణం నుంచి తుగ్గలి మండలం రాంపల్లె గ్రామానికి వెళ్లేందుకు భరత్ అనే ఆటో డ్రైవర్‌కు చెందిన ఆటోలో కుమ్మరి రాముడు, హనుమంతు,రాఘవేంద్రస్వామి వెళ్తుండగా 44వ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టిందని బాధితులు తెలిపారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హైవే పోలీసులు ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలిస్తున్నారు.

నేడు మంత్రి బుగ్గన రాక

సంజామల: మండల కేంద్రంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల్లో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి శనివారం పాల్గొననున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి,రాష్ట్ర అదనపు కార్యదర్శి గుండం సూర్యప్రకాష్ రెడ్డి, రాష్ట్ర యువజన కార్యదర్శి పోచ శీలారెడ్డి శుక్రవారం తెలిపారు. వారు మాట్లాడుతూ రూ 1.20 కోట్లతో నూతనంగా నిర్మించిన ఎంపీడీఓ కార్యాలయం, రూ.75 లక్షలతో ఏరియా పశువైద్యశాల నూతన భవనాలను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డితో నేతృత్వంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డితో కలిసి ప్రారంభిస్తున్నారని వివరించారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ



సీఐ తిమ్మారెడ్డి

బనగానపల్లెరూరల్: బనగానపల్లె సర్కిల్ నూతన సీఐగా తిమ్మారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సీఐగా పని చేసిన మల్లికార్జున గుప్తా నంద్యాల హెడ్ క్వార్టర్‌కు బదిలీ చేయడంతో ఆయన స్థానంలో కర్నూలు వన్‌టౌన్‌లో సర్కిల్ కార్యాలయంలో విధులు నిర్వహించే తిమ్మారెడ్డిని ఇక్కడికి బదిలీ చేశారు. నూతన సీఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని, ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం

బేతంచెర్ల: పట్టణంలోని పూదోట ఆశ్రమంలో లోక కల్యాణార్థం కొనసాగుతున్న విష్ణు సహస్ర నామ సోత్ర సామూహిక పారాయణంలో శుక్రవారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆశ్రమ నిర్వాహకులు గుండాగోపాలు, గౌరి హుసేన్‌రెడ్డి, భజనకృష్ణయ్య, డాక్టర్ నరసింహులు మాట్లాడుతూ పారాయణంతో భగవంతుడి అనుగ్రహం లభిస్తుందని చెప్పారు. అన్నదానం కోసం బైసాని శ్రీనివాసులు, కుంచ శంకర్‌రెడ్డి, సూర్య చంద్రారెడ్డి, పాలెం పెద్ద తిమ్మారెడ్డి రూ.21 వేలు విరాళం అందజేశారు.

గురుకుల పాఠశాలకు ఎంపిక

సంజామల: మండలంని బొందలదిన్నె గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు 5వ తరగతి గురుకుల పాఠశాలకు ప్రవేశానికి పరీక్షల్లో అర్హత సాధించారు. డి.శివమణి పత్తికొండ గురుకులకు, బనవాసి పాఠశాలకు డి.కలీదా ఎంపికయ్యారని హెచ్ఎం హుసేన్ అలీ శుక్రవారం తెలిపారు.